క్లుప్తంగా

14 నుంచి ఆర్ఐటీఐలో కౌన్సెలింగ్


ప్రిన్సిపాల్ రాజారావు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని ఆర్ఐటీలో ప్రవేశాలకు సంబంధించి అరకు ఐటీఐలో ఈనెల 14, 15 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ రాజారావు చెప్పారు. ఆర్ఐటీఐలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు, తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9866108607 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణపై కళాజాత


ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

రంపచోడవరం: పర్యావరణ పరిరక్షణపై ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వైవీఆర్ రూరల్ డెవలప్‌మెంట్ శనివారం కళాజాత కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భాగంగా చెట్లను పరిరక్షించాలని, మొక్కలు నాటాలని, పాలిథిన్ కవర్లు బదులు గుడ్డ సంచులు వినియోగించాలని, ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని ప్రదర్శనలో జానపద గీతాలు వీధి నాటికలు ఆకట్టుకున్నాయి. ఎస్‌బీఐ సెంటర్, బస్ స్టాండ్ సెంటర్ ఏరియాలో కళాకారులు వై.గణేష్, రవితేజ, లక్ష్మి ప్రదర్శనలు పలువురిని ఆలోచింపజేశాయి. ప్రదర్శనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.

చిన్నారులకు ఆటల పోటీలు


పోటీల్లో చిన్నారులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు శనివారం ఆటలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయాధికారి శెట్టి సునీత మాట్లాడుతూ వేసవి శిబిరాలు సోమవారంతో ముగుస్తున్నాయన్నారు. వేసవి శిబిరాల్లో భాగంగా చిన్నారులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు.

గేదెను ఢీకొని వ్యక్తికి గాయాలు


గేదెను ఢీకొని గాయాల పాలైన నాగేంద్రబాబు

అడ్డతీగల: మండలంలోని వేటమామిడి సమీపాన ఏకలవ్య పాఠశాల భవనం వద్ద ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టకి చెందిన ఎఫ్.నాగేంద్రబాబు మోటార్‌బైక్‌పై అడ్డతీగల వస్తుండగా అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన గేదెను ఢీకొని ఇతను తీవ్రగాయాలపాలయ్యాడు. ముఖంపై తీవ్రగాయాలతో రోడ్డుపై పడిపోయిన ఇతన్ని అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి ఆటోలో అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నాడు.

14న రక్తదాన శిబిరం

పాడేరురూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 14న జరిగే రక్తదానం శిబిరంలోని పాల్గొని, రక్తదానం చేసి, ప్రాణదాతలు నివాలని, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి గౌరీ శంకరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథులుగా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ పాల్గొంటున్నారని పేర్కొన్నారు. రక్తదానం శిబిరంలోని యువత పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు


సింగరాలపాడులో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి


వెంకంపాలెంలో గ్రామస్తులకు ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- శివారు గ్రామాల్లో అరకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి,ధనలక్ష్మి పర్యటన
- మండుటెండలోనూ కొనసాగిన 'గడప గడపకు' విశేష ఆదరణ

కొయ్యూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయని, ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఎం.మాకవరం సచివాలయం పరిధిలో చింతలవూడి, లుభుర్తి, లొద్దిపాకలు, సింగరాలపాడులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 240 గడపలను వారు సందర్శించారు. ప్రజలతో మమేకమయ్యారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువైందన్నారు. ఇంటి వద్దకే పింఛన్, రేషన్ తదితర ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, వైస్ ఎంపీపీ నూకాలమ్మ, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, సర్పంచ్‌లు సెగ్గే రమాదేవి, చందు, శ్రీను, ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ, సభ్యులు అచ్యుత్, ట్రైకార్ డైరెక్టర్ ఎస్.సరస్వతి, ఎంపీటీసీ సభ్యురాలు పొడుగు రత్నం, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలినాయుడు. మహిళా విభాగ నాయకురాలు సావిత్రి, మండల కన్వీనర్ సుధాకర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

వీఆర్ పురం: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని చినమట్టపల్లి పంచాయతీ పరిధిలోని వెంకంపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. 2019 నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ఎవరెవరికి ఎంత మేరకు లబ్ధి చేకూరిందో గణాంకాలతో సహా వివరించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 60 గడపలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత దేశంలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత టీడీపీ హయాంలో పథకాలు జన్మభూమి కమిటీలకే పరిమితమయ్యాయని, ప్రజలకు తీరని నష్టం జరిగిందన్నారు. అయితే నేడు సీఎం జగనన్న పాలనలో వలంటీర్ల ద్వారా లబ్ధిదారులను గుర్తించి నేరుగా వారి చెంతకే పథకాలను అందిస్తున్న పరిస్థితి ఉందన్నారు. స్థానిక సమస్యలు తెలుసుకొని తక్షణమే పరిష్కరించదగ్గ సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం చూపారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, వైస్ ఎంపీపీ ముత్యాల భవాని, ఎంపీటీసీ సభ్యురాలు బంధం విజయలక్ష్మి, సర్పంచ్‌లు పిట్టా రామారావు, మూట్ల బాలరాజు, మండల పార్టీ కన్వీనర్ పొడియం గోపాల్, తహసీల్దార్ ఎస్.శ్రీధర్, ఇన్‌చార్జి ఎంపీడీవో రత్నకుమారి, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ పి.వెంకటేష్, నాయకులు ముత్యాల శ్రీనివాస్, మాచర్ల గంగులు, ముత్యాల మురళి, చిక్కాల బాలు, బొడ్డు సత్యనారాయణ, కోటం జయరాజ్, ముత్యాల గౌతమ్ ,మాచర్ల వెంగళరావు, చీమల కాంతారావు, మోడెం నరేష్ , సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అ'ద్వితీయ'ం.. అధునాతనం


నాడు-నేడు మొదటి విడతలో అభివృద్ధి చెందిన శివలింగపురం పాఠశాల

- సర్కారు బడులకు మహర్దశ
- నాడు-నేడుతో పాఠశాలలు అభివృద్ధి


రేగం గ్రామంలో నాడు-నేడులో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

అనంతగిరి: విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పును తీసుకురావాలనే ధృడ సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నంలో భాగంగా మనబడి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మారిపోయాయి. గతంలోని సమస్యలతో దర్శనమిచ్చే పాఠశాలలు నేడు సౌకర్యాలతో స్వాగతం పలుకుతున్నాయి. ప్రభుత్వం నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు కల్పిస్తోంది. కార్పొరేట్ దీటుగా సర్కారు బడుల్లో సౌకర్యాలు దర్శనమిస్తున్నాయి. పాఠశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, అదనపు భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. నాడు-నేడు ద్వారా సర్కారు బడుల్లో మెరుగైన సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తోంది. ఇప్పటికే మొదటి విడతలో చాలా పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరిగాయి. నాడు-నేడు రెండో విడతలో భాగంగా పనులు జోరందుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొవడంతో విద్యార్థులతో పాటుగా తల్లిదండ్రులు సంతోషిస్తున్నారు.

అనంతగిరి మండలం నాడు-నేడు వివరాలు

- మొదటి విడతలో 40 పాఠశాలల్లో రూ.9.69 కోట్లుతో పనులు పూర్తయ్యాయి.
- రెండో విడతలో 46 పాఠశాలలకు, నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.10.39 కోట్లుతో పనులు జరుగుతున్నాయి.
- రెండో విడతలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.60.70 లక్షల మంజూరు చేశారు. పనులు జరుగుతున్నాయి.

నాడు నేడుతో పాఠశాలలు అభివృద్ధి

మొదటి విడతలో పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దారు. రెండో విడతలో ప్రస్తుతం పాఠశాలలు పనులు జరుగుతున్నాయి. వీటితో పాటుగా రెండో విడతలోని నాడు-నేడు ద్వారా నూతన అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణం, ప్రభుత్వ జూనియర్ కళాశాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షణీయమని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారు.

త్వరితగతిన పనులు

మండలంలోని జరుగుతు న్న రెండో విడత నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్య లు చేపడుతున్నాం. నాణ్య తప్రమాణాలతో పనులు చేపట్టేవిధంగా పర్యవేక్షిస్తున్నాం. సచివాలయం సి బ్బంది సమన్వయంతో ముందుకు వెళుతున్నాం.

– గణేష్, ఏఈ, ట్రైబల్ వెల్ఫేర్, అనంతగిరి

ఇలాగైతే ఎలా..

దోమతెరల వినియోగంపై నిర్లక్ష్యపు నీడలు



మొక్కపుట్టు, దూళిపుట్టులో మొక్కలకు రక్షణగా కట్టిన దోమ తెరలు

ముంచంగిపుట్టు: ప్రజల ఆరోగ్యం కోసం, దోమల నుంచి రక్షణ పొందేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి వైద్య ఆరోగ్య శాఖ ద్వారా గ్రామాల్లో గిరిజనులకు దోమతెరలు పంపిణీ చేస్తోంది. కొంత మంది వాటిని సక్రమంగా వినియోగించుకుంటూ దోమల నుంచి రక్షణ పొందుతూ మలేరియా ఇతరత్రా రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరికొంతమంది దోమ తెరల వాడకాన్ని పూర్తిగా అశ్రద్ధ చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో దోమలు ప్రభావం ఎక్కువగా ఉంది. అయితే ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న దోమ తెరలను, సక్రమంగా వినియోగించకుండా పలు గ్రామాల్లో కొందరు మొక్కలకు రక్షణగా వాడడం వారి నిర్లక్ష్యానికి అర్థం పడుతుంది. ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దోమతెరల వాడకంపై ఎంత అవగాహన కల్పించినా, నిర్లక్ష్యం వల్ల కొందరు మలేరియా తదితర రోగాల బారిన పడుతున్నారని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా దోమతెరలను సక్రమంగా వినియోగించి, రోగాల బారిన పడకుండా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కోరుతున్నారు.

హక్కుల పరిరక్షణకు కృషి

అడ్డతీగల: జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షుడిగా అడ్డతీగలలోని అనూప్ విద్యాసంస్థల కరస్పాండెంట్ చీకట్ల ఆశీర్వాదాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుమిత్రానందన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ హక్కుల పరిరక్షణతో పాటు, పేద పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మండల శాఖ జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం అధ్యక్షుడిగా దడాల సూర్యకుమార్‌ను ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు.

చకచకా పనులు


చల్లనిసిల్ప-సీలేరు రోడ్డు పనులు

- శివారు గ్రామాలకు రోడ్లు
- కాలనీల్లో డ్రైనేజీల ఏర్పాటు


సీసాగుడలో డ్రైనేజీ పనులు

సీలేరు: సీలేరు మీదుగా అంతర్‌రాష్ట్రాలకు వెళ్లే, ఘాట్‌రోడ్డులో తారురోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గిరిజన ఉప ప్రణాళిక పథకంలో దుప్పులవాడ పంచాయతీ చల్లనిసిల్ప నుంచి సీలేరు జలవిద్యుత్ కేంద్రం వరకు సుమారు రూ.కోటి రుపాయలతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ ఏఈ భరతుడు రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలతో రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. రోడ్డు నిర్మాణం జరుగుతుండడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ సీసాగుడ గ్రామంలోని మండల పరిషత్ అభివృద్ధి నిధులతో డ్రైనేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. టోకూరు పంచాయతీకి మండల పరిషత్ నుంచి ఎంపీపీ శెట్టి నీలవేణి రూ.4లక్షలను కేటాయించారు. ఎంపీటీసీ రత్నకుమారి ఆధ్వర్యంలోని సీసాగుడ గ్రామంలోని డ్రైనేజీ నిర్మాణ పనులను చేపడుతున్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీపీ శెట్టి నీలవేణికి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత గిరిజనులకు న్యాయం చేయాలి


గిరిజనులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

అనంతగిరి: మండలంలోని ఎగువశోభ, టోకూరు పంచాయతీల్లో పోర్నపోదర్, బిర్జిగుడ, దొరగుడ, కొత్తవలస గ్రామాలను ఆనుకుని, కేకే లైన్ రెండో రైల్వే లైన్ విస్తరణ పనులు జరుగుతుండడంతో గిరిజనులు భూములు కోల్పోతున్నారని, జెడ్పీటీసీ దీసరి గంగరాజు అన్నారు. ఆయా గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించి, గిరిజనులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో రైల్వే అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, గిరిజనులు భూములను చదునుచేస్తున్నట్టు పలువురు బాధితులు తెలియజేశారన్నారు. రైల్వేలైన్ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న గిరిజనులకు న్యాయం చేయాలని, ఉన్నతాధికారులు స్పందించి, సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు. ఎగువశోభ సర్పంచ్ సింహాద్రి, సీపీఎం నాయకుడు దేవన్న తదితరులున్నారు.

గ్రామాల్లో జనమైత్రి


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాంబాబు

వై.రామవరం: మండలంలోని చామగడ్డ పంచాయతీ రాముల కొండ, దద్దిలికివాడ తదితర మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో సీఐ వై.రాంబాబు ఆధ్వర్యంలో జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు శనివారం జనమైత్రి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక శక్తులకు సహకరించొద్దని అడ్డతీగల సీఐ వై.రాంబాబు అన్నారు. సారా తయారీ, అమ్మకాలు, గంజాయి రవాణా, సాగు వంటివి చట్టరీత్యా నేరమని, వాటికి దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. రుణ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి పోలీసు శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. గిరిజన యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనకు పోలీసుశాఖ ప్రోత్సహిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనారోగ్యానికి గురైతే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు పొందాలని సూచించారు. యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్, అడిషనల్ ఎస్: కె.రాంబాబు పాల్గొన్నారు.

పాడేరురూరల్: గుట్టులపుట్టు పంచాయతీ సంతబయలు, డబ్బపుట్టు, గ్రామాల్లో పాడేరు సీఐ సుధాకర్, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్ఐ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కూనవరం: సీసీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలో చూచిరేవులగూడెం పంచాయతీలో రూ. 10 లక్షలు, జగ్గవరం పంచాయతీలో రూ.5లక్షలు జెడ్పీటీసీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ వర్షాలు పడక ముందే రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసుకుంటే ఇబ్బందులు ఉండవని సూచించారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, చూచిరేవులగూడెం, జగ్గవరం, చినార్కూర్ సర్పంచ్‌లు తెల్లం నిరోషా, కారం పార్వతి, అభిరామ్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అవుల మరియాదాస్, మేరుకులం, ఆరెకటిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు డి.గంగాధర్, ఎ.వెంకటరామారావు, వ్యవసాయ కమిటీ చైర్మన్ పూర్ణానందం, సొసైటీ అధ్యక్షుడు ఎన్.కొండలరావు, కూనవరం ఎంపీటీసీ కొమ్మని అనంతలక్ష్మి, నాయకులు గుజ్జాబాబు, దివాకర్, హరనాథ్, వెంకన్న, సత్తిపండు, లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట


ప్రత్యేకాలంకరణలో సీతారామచంద్రుల విగ్రహాలు


అనంతగిరిలోని ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు


గంగవరంలో పూజలు చేస్తున్న భక్తులు

అనంతగిరి: మండల కేంద్రంలోని వినాయకుడి ఆలయం వద్ద అంజనేయస్వామి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో శనివారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని దాత కన్నమ్మ అందజేశారు. వర్తక సంఘం సభ్యులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు.

గంగవరం : పాతగంగవరంలోని రామాలయంలోషీర్డీ సాయిబాబా, గణపతి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీరామదాసు మహిళ భక్త కమిటీ ఆధ్వర్యంలో కొత్తపల్లి సాయిబాబా మందిర ప్రధాన అర్చకులు శ్రీఅయ్యప్పశర్మ శిష్యబృందం వేద మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. విగ్రహ దాతలు కొమ్మన చిన్నారావు, విజయలక్ష్మి దంపతులు షిర్డీ సాయినాధుని పాలరాతి విగ్రహాన్ని, మోరా వెంకటేశ్వరరావు దంపతులు గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించారు. భక్తులు యర్లంకి సత్యనారాయణ, సరస్వతి దంపతులు సాయిబాబా మందిరంలో ఇత్తడి పళ్లాలు, శఠగోపం, కుందులు, ఇత్తడి పూజా సామాగ్రిని బహుకరించారు. తొలుత గణపతి పూజ అనంతరం సాయిబాబా పాలరాతి విగ్రహానికి విశేష అభిషేకాలు నిర్వహించారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు వై.రామకృష్ణ ప్రసాద్, శేషాచార్యులు, బీజేపీ మహిళ నాయకులు సత్యనారాయణమ్మ, ఉపాధ్యాయులు నాగమణి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని చినరెల్లంగిపాడు గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్, శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. పురోహితులు పల్లాల విశ్వేశ్వరరెడ్డి మేళతాళాలు, వేద మంత్రాల నడుమ విగ్రహప్రతిష్ట కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ప్రసాదాన్ని అందించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, కమిటీ సభ్యులు పాశం శేషగిరి, ఎంపీటీసీ సభ్యుడు గొల్లపూడి పెద్దిరాజు, గ్రామపెద్దలు శివరామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.